క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: మాతృశ్రీనగర్, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు. కల్యాణి గార్డెన్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హైదర్‌నగర్ పెట్రోల్ పంప్, మియాపూర్ ప్రధాన రోడ్డు, మాతృశ్రీనగర్, కల్వరి టెంపుల్ రోడ్డు, మెట్రో రైల్వే స్టేషన్, మాధవనగర్, మియాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- జనప్రియనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆల్విన్ ఎక్స్‌రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

మల్లన్నకు ప్రత్యేక పూజలు



మధు, శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు: గ్రామాల్లో నిర్వహించే జాతరలతో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంటుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పెద్దకంజర్లలో జరిగిన మల్లన్న జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ మల్లన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర నిర్వాహకులు మధుముదిరాజ్‌ను, శ్రీనివాస్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు.

ప్లాస్టిక్ సర్జరీ సెంటర్‌ను ప్రారంభించిన హీరో సుశాంత్



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న హీరో సుశాంత్

గచ్చిబౌలి: కొండాపూర్‌లో రెవెరా ప్లాస్టిక్ సర్జరీ, స్కిన్ కేర్ సెంటర్‌ను హీరో సుశాంత్ తన తల్లి నాగసుశీలతో కలిసి ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ అఖిలేష్ తోట ఆధ్వర్యంలో నడిచే ఈ ఆస్పత్రిని సుశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితమే నగరంలో ఎక్స్‌క్లూజివ్ ప్లాస్టిక్ సర్జరీ క్లినిక్‌ను ప్రారంభించిన అతి కొద్ది మందిలో తోట వెంకట్ ఒకరని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన కుమారుడు అఖిలేష్ కొండాపూర్‌లో మరో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, డాక్టర్ రాజేశ్‌వాసు, శివరాం మల్లెల పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో మూడవ అంతస్తులో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆదివారం రెడ్డి సంక్షేమం సంఘం చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఐకమత్యంతో మెలుగుతూ సంఘం తరపున రెడ్డి సంఘం భవనం నిర్మించి అందరికి ఆదర్శంగా నిలవడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లో ఆదివారం శ్రీసంజీవని ఆంజనేయస్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహ యంత్ర ప్రతిష్ఠ ప్రథమ దర్శనం చేసుకున్నారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ.. రాజేశ్వరరావును ఆలయ నిర్మాణంలో సహకరించి మొదటి దాతగా ముందుకొచ్చారని అన్నారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌదరి వెంకట్రావు, తిరుపతిరావు, భాస్కరరావు, సీవీరావు, దుర్గాప్రసాద్‌రావు, నాగరాజు, శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావు, గోపాల్‌రావు, భాస్కర్‌రెడ్డి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు మహర్దశ

- గచ్చిబౌలిలో చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించిన అధికారులు
- దశలవారీగా అన్ని చెరువులను సుందరీకరించేందుకు ప్రణాళికలు
- ఇప్పటికే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్న రెండు చెరువులు
- పనులు ప్రారంభించినవి మరికొన్ని

రాయదుర్గం: చెరువులు, కుంటలు ప్రజలు సేద తీరే ప్రాంతాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌గా పేరొందిన గచ్చిబౌలిలో చెరువులు, కుంటలను దశలవారీగా సుందరీకరిస్తున్నారు. రాయదుర్గంలోని మల్కం చెరువు, ఖాజాగూడలోని పెద్ద చెరువును అభివృద్ధి చేసిన అధికారులు ప్రస్తుతం మరికొన్ని చెరువులపై దృష్టిసారించారు. నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ చొరవ తీసుకోవడంతో పాటు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ప్రత్యేక దృష్టి సారించడంతో చెరువులు, కుంటలు అభివృద్ధి చెందుతున్నాయి.

ఆహ్లాదాన్ని పంచేలా..

- నీటి పారుదల శాఖ, జీహెచ్ఎంసీ, వివిధ సంస్థల సీఎస్ఆర్ నిధులతో పార్కులను సుందరీకరించారు. మల్కం చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గ్రీనరీతో ఆహ్లాదకరంగా మారింది. ఖాజాగూడ పెద్ద చెరువుకు ఒక వైపు రహదారి ఫుట్‌పాత్, గ్రీనరీ ఆకట్టుకుంటోంది. ఈ చెరువు పక్కనే కొత్తగా వేసిన రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఏర్పాటు చేసిన భారీ బండ రాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



సుందరీకరించిన మల్కం చెరువు(ఫైల్)

పనులు జరుగుతున్నవి..

కాలనీ పేరు	చెరువు/కుంటపేరు	కేటాయించిన నిధులు
కేవవనగర్ బస్తీ	గోసాయికుంట	రూ.1.78 కోట్లు
గోపన్‌పల్లితాండ/తాజ్‌నగర్	కోమటికుంట	రూ.2.65 కోట్లు
ప్రశాంత్‌హిల్స్ కాలనీ	కుమ్మరికుంట	రూ.8 లక్షలు
టెలికామ్‌నగర్‌లోని నిథమ్ ప్రాంగణం	రామమ్మకుంట	రూ.35 లక్షలు

దశలవారీగా అన్ని చెరువులను సుందరీకరిస్తాం



దశలవారీగా చెరువులన్నింటినీ సుందరీకరిస్తా. జీహెచ్ఎంసీ ఖాళీ స్థలాలు లేకపోవడంతో పార్కులు ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రతి కాలనీలో ఉన్న చెరువులను సుందరీకరిస్తే స్థానికులకు సేదతీరేందుకు, వాకింగ్ చేయడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. మల్కం చెరువు, పెద్ద చెరువును సుందరీకరించగా ఇతర చెరువులపై సైతం దృష్టిసారించాం. పూర్తిగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు కృషి చేస్తున్నాం.

– గంగాధర్ రెడ్డి, గచ్చిబౌలి కార్పొరేటర్

ఎమ్మెల్యే చొరవతో చెరువులకు మహర్దశ



ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చొరవ తీసుకొని వివిధ సంస్థల సహకారంతో మల్కం చెరువు, పెద్దచెరువులను సుందరీకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్, సందర్శకులతో కళకళలాడుతున్నాయి. మరో మూడు చెరువుల అభివృద్ధికి ఇటీవలే శంకుస్థాపన చేశారు. దశలవారీగా మిగతా చెరువులను సైతం సుందరీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– కొమిరిశెట్టి సాయిబాబా, మాజీ కార్పొరేటర్

ఇప్పటి వరకు సుందరీకరించిన చెరువులు

కాలనీపేరు	చెరువుపేరు	వెచ్చించిన నిధులు(సుమారు)
రాయదుర్గం	మల్కంచెరువు	రూ.30 కోట్లు
ఖాజాగూడ	పెద్ద చెరువు	రూ.85 లక్షలు



త్వరలో సుందరీకరణ పనులు చేపట్టనున్న కొమటికుంట

పనులు చేపట్టాల్సినవి

కాలనీపేరు	చెరువు/ కుంట పేరు
ఖాజాగూడ	భగీరథ చెరువు
నానక్‌రాంగూడ	మేడికుంట, రంగ్‌లాల్ కుంట, చింతల్ కుంట, సందప్ప కుంట
ఖాజాగూడ	తౌతోనికుంట
గోపన్‌పల్లి	చిన్న పెద్దచెరువు, దేవునికుంట
నల్లగండ్ల	నల్లగండ్ల చెరువు

సంత్ రవిదాస్ మహారాజ్ బోధనలు అనుసరణీయం



సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ తులసీవనం వద్ద బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు రవీంద్రరావు, నరేందర్‌రెడ్డిలతో కలిసి రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ భక్తి మార్గం ద్వారా కులవివక్ష లేని సమాజాన్ని అందించారన్నారు. రవిదాస్ బతికి ఉన్నంత కాలం చర్మకార వృత్తిని కొనసాగించి స్వయం కృషితో ఎదిగారన్నారు. గురుముఖి పంజాబీ భాషను 35 అక్షరాలలో రాసిన గొప్ప భాషా సృష్టికర్త రవిదాస్ అని కొనియాడారు. సంత్ రవిదాస్ మహారాజు బోధనలు మనం మనసా వాచా కర్మేణా ఆచరించినప్పుడే వారి ఆశయ సమాజాన్ని సాధించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజు, వినోద్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సైక్లోథాన్'



సైక్లోథాన్‌లో పాల్గొన్న సైక్లిస్టులు

గచ్చిబౌలి: గచ్చిబౌలి కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు సైక్లోథాన్ నిర్వహించారు. హెమటాలజీ హెచ్ఓడీ డాక్టర్ ఏఎంవీఆర్ నరేంద్రతో కలిసి మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి జెండా ఊపి సైక్లోథాన్‌ను ప్రారంభించారు. దూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకంతో కేన్సర్ వస్తుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి బారిన పడి ఎంతో మంది విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేర్ హస్పిటల్ హెచ్‌సీఓఓ రాజీవ్‌చౌరీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ హెచ్ఓడీ డాక్టర్ సుధాసిన్హా మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ప్రతి సంవత్సరం కేన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. ఈ వ్యాధిని త్వరగా గుర్తిస్తే చికిత్సతో నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సతీష్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

పటాన్‌చెరు వైఎస్సార్‌టీపీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్



క్రీడాకారులను సన్మానిస్తున్న చంద్రశేఖర్

పటాన్‌చెరు టౌన్: క్రీడాకారులకు అండగా ఉంటూ వారిని ప్రోత్సహిస్తానని పటాన్‌చెరు వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన ఐదో ఆల్ ఇండియా మాస్టర్ గేమ్స్‌లో శంకర్‌పల్లి మున్సిపాలిటీ బుల్కాపురం గ్రామానికి చెందిన శ్రీను, పటాన్‌చెరు మండలం పాటీఘనపూర్ గ్రామానికి చెందిన సురేశ్ సత్తా చాటారు. 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో శ్రీను, ద్వితీయ స్థానంలో సురేశ్ నిలిచారు. ఈ క్రమంలో వారిని చంద్రశేఖర్ ఆదివారం తన నివాసంలో సన్మానించి అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం వారికి సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



శివలింగానికి అభిషేకం చేస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: దీక్షతో క్రమశిక్షణ అలవడుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధుముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామంలో మాజీ ఎంపీటీసీ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివ మహా పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, శివ స్వాములు ఆయనను సత్కరించారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శివ స్వాములు రాజేష్‌గౌడ్, రాజుగౌడ్, శ్రీధర్‌చారి, మల్లేష్, ఎండీ కలీం, అశోక్, యాదయ్య, సాయినాథ్ రెడ్డి, రాజు, వెంకట్‌గౌడ్, వంశీ, ఎండీ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

శేరిలింగంపల్లి: తెలంగాణ అంబేడ్కర్ సంఘం రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం డివిజన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం సంఘం సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతురాజు లాలయ్య, నాయకులు మల్లెల జయ, రవీందర్, దీప, బస్వరాజ్, గోపాల్‌యాదవ్, మహేష్, విద్యావతిదేవి, జయంత్‌కుమార్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు: స్వామి వివేకానంద సేవా సమితి నూతన సంవత్సర కేలండర్‌ను పటాన్‌చెరు క్రైం సీఐ బీసన్న, ఎస్ఐ ప్రసాద్‌రావు సేవా సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి క్రైం సీఐ బీసన్న, ఎస్ఐ ప్రసాద్‌రావు స్వామి వివేకానంద చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటం అందజేస్తున్న సమితి సభ్యులు



కేలండర్‌ను ఆవిష్కరించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నా



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆలయాలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న గాలిగోపురం గడప పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆలయాలను, ప్రార్థనా మందిరాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలి

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్ కాలనీలో బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో తిరిగి సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లను తవ్వి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి పనులను పక్కనబెట్టి ప్రజాప్రతినిధులకు వంతపాడుతున్నారని విమర్శించారు. కాలనీ సమస్యలపై చందానగర్ సర్కిల్ డిప్యూటీ ఉప కమిషనర్‌ను కలిసి నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరతామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, నాయకులు ఎల్లేష్, కుమార్‌యాదవ్, చందర్‌యాదవ్, రవి, ఎస్ఎస్ రావు, వెంకట్‌రావు, సత్యనారాయణ, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కూచిపూడి నృత్య శిక్షణ కారుడు లక్ష్మీబాబు, హైదరాబాద్ కూచిపూడి కళాకారుడు పసుమర్తి మృత్యుంజయశర్మ, అలీంఖాన్, కుమారి సాహితి నడంపల్లితో నృత్య ప్రదర్శన ఇచ్చారు. శ్రీగణపతిం, జయలక్ష్మీ, అలోకయే, ఆనంద తాండవం, పదం, జావలి, ఐగిరినందిని, తిల్లానా మొదలైన అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం మేరకు.. సదాశివపేట్ మండలం ఆరూర్ గ్రామానికి చెందిన కిషోర్(27) ఇంటర్వ్యూ కోసం ఈ నెల 3న హైదరాబాద్ వెళ్లాడు. 4వ తేదీన రాత్రి తన ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా పటాన్‌చెరులోని శ్రీకృష్ణ కార్ వాష్ సమీపంలో డివైడర్‌ని ఢీకొని అవతలి రోడ్డులో పడ్డాడు. అదే సమయంలో సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కిషోర్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



మహేష్ మృతదేహం

గచ్చిబౌలి: స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతూ బాలుడు విద్యుతాఘాతంతో మృతిచెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా సరిగాపురం మండలం సంగెం గ్రామానికి చెందిన బుజ్జవ్వ ముగ్గురు కుమారులతో కలిసి హఫీజ్‌పేట్‌లో నివాసముంటుంది. ఆమె చిన్నకుమారుడు మహేష్(14) కొత్తగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. సెలవు రోజుల్లో తనకు తెలిసిన వారి వద్ద జ్యూస్ షాప్‌లో పనిచేస్తుంటాడు. ఆదివారం ఉదయం పనిలో భాగంగా స్విచ్‌బోర్డులో ప్లగ్ పెట్టడానికి వెళ్లగా విద్యుతాఘాతంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సర్టిఫికెట్లు ఉన్న బ్యాగ్ అప్పగింత



హరిమోహన్‌కు బ్యాగ్ అప్పగిస్తున్న గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్ విజయ్‌నాయక్, కానిస్టేబుల్ హన్మంతు

గచ్చిబౌలి: పాస్‌పోర్ట్‌తో పాటు సర్టిఫికెట్లు, దుస్తులు ఉన్న బ్యాగ్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు సంబంధిత వ్యక్తికి అప్పగించారు. ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో గచ్చిబౌలి చౌరస్తాలో ఓ బ్యాగ్ ఉండటాన్ని ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌నాయక్, కానిస్టేబుల్ హన్మంతు గమనించారు. బ్యాగ్ తెరిచి చూడగా గుల్బర్గాకు చెందిన హరిమోహన్ దాస్తికి చెందిన పాస్‌పోర్ట్, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జాబ్ అపాయింట్‌మెంట్ లెటర్ ఉన్నాయి. చెక్‌బుక్‌పై ఉన్న సెల్ నెంబర్‌కు ఫోన్ చేయగా హరిమోహన్ కొద్ది సేపటికి అక్కడికి వచ్చాడు. తాను బ్యాగ్ ఇక్కడ పెట్టి మర్చిపోయానని, తిరిగి అందించినందుకు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రాయదుర్గం: డాక్టర్ జిలుకర శ్రీనివాస్ రాసిన బైండ్ల సెంద్రయ్య కథలు ఆత్మగౌరవ అస్తిత్వానికి ప్రతీకలని శాతవాహన విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి పేర్కొన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ లెక్చర్ హాల్‌లో తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం రాత్రి దళిత విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రచయిత డాక్టర్ జిలుకర శ్రీనివాస్ రచించిన »బైండ్ల సెంద్రయ్య« కథలపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుజాత మాట్లాడుతూ.. బైండ్ల పూజారి తనానికి, బ్రాహ్మణుల పూజారి తత్వానికి తేడాలు ఉన్నాయని, బైండ్ల జీవితాల్లోని అనేక కోణాలు ఈ కథల్లో ఉన్నాయన్నారు. కేంద్రీయ సాహిత్య యువ పురస్కార గ్రహీత డాక్టర్ గడ్డం మోహన్‌రావు మాట్లాడుతూ.. ఈ కథల్లోని ఉపమానాలను పోల్చటం గ్రామీణ వాతావరణాన్ని తలపిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు డాక్టర్ ఏకే ప్రభాకర్, పుస్తక రచయిత డాక్టర్ జిలుకర శ్రీనివాస్, హెచ్‌సీయూ డీఎస్‌డబ్ల్యూ ప్రొఫెసర్ జి.నాగరాజు, దళిత స్టూడెంట్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయండి



గుంతలమయమైన రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నప్పటికీ మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో రసాయనాలను కలుపుతున్న సమయంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని కేకులే ఫార్మా పరిశ్రమలోని 4వ అంతస్తులో కార్మికులు రసాయనాలను కలుపుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. అక్కడే పనిచేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారు. సమీప పరిశ్రమల సహకారంతో ఫోం విరజిమ్మి మంటలను అదుపు చేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. నైపుణ్యం ఉన్న కార్మికులతో ఇలాంటి పనులు చేయించాల్సి ఉండగా యాజమాన్యం నిబంధనలను పాటించటం లేదని కార్మికులు ఆరోపించారు. ప్రమాదం జరిగిన సమయంలో జర్నలిస్టులను ఘటన స్థలం వరకు వెళ్లకుండా పరిశ్రమ యాజమాన్యం అడ్డుకుంది. నిర్వహణ లోపాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే పరిశ్రమలోకి వెళ్లనీయడం లేదని జర్నలిస్టులు ఆరోపించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగలేదని యాజమాన్యం ప్రకటించింది.



పరిశ్రమలో వెలువడుతున్న పొగలు

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ కిందికుంట పార్కు పాదాచారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్భవ ఆసుపత్రి వారి సౌజన్యంతో బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు 45 నిమిషాలు తప్పనిసరిగా విధిగా వాకింగ్ చేయాలన్నారు. అక్కడికి విచ్చేసిన పాదాచారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌కేవై టీం సభ్యులను అభినందించారు.